www.eenadupratibha.net

# బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (తెలంగాణ)

## సంగ్రహణాత్మక మూల్యాంకనం – I

### పదోతరగతి తెలుగు నమూనా ప్రశ్నపత్రం

### పేపర్ – I

| సమయం: 2 గం.45 ని. | పార్టు – A & B | మొత్తం మార్కులు: 40 |
|---|---|---|

సూచన: మొదటి 15 నిమిషాలు ప్రశ్నపత్రం చదవండి. మిగతా 2 గంటల సమయంలో జవాబులు రాయండి.

| సమయం: 2 గం. | పార్టు – A | మార్కులు: 30 |
|---|---|---|

**I.** స్వీయరచన **4 × 3 = 12**

అ) కింది ప్రశ్నలకు అయిదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

**1.** మాట తప్పకుండుట మంచిది. ఎందుకో రాయండి.

**2.** 'వీరు వీరులు పరార్థుల్ తెల్గు జోదుల్' అంటే మీకేం అర్థమైంది?

**3.** గురుస్థానీయులని ఎవరిని అంటారు?

**4.** దాశరథి గురించి రాయండి.

ఆ) కిందివాటిలో ప్రతిభాగం నుంచి తప్పనిసరిగా ఒక ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి. **3 × 6 = 18**

**5.** నగరంలో జీవన విధానం ఎలా ఉంటే బాగుండేదో వివరించండి.

**(లేదా)**

శతక మధురిమ పాఠం ఆధారంగా మీరు తెలుసుకున్న విషయాలు ఏమిటో తెలపండి.

**6.** 'కొత్తబాట' పాఠాన్ని అనుసరించి ఆనాటి పల్లెల్లోని పరిస్థితులను విశ్లేషించండి.

**(లేదా)**

నిమ్న జాతులను భాగ్యరెడ్డి వర్మ ఎలా జాగృతం చేశాడో వివరించండి.

**7.** శ్రీరాముడు శివధనుస్సును విరిచిన విధానాన్ని తెలపండి.

**(లేదా)**

రాముడు వనవాసానికి వెళ్లడానికి కారణాలు రాయండి.

www.eenadupratibha.net

www.eenadupratibha.net

సమయం: 30 ని. | **పార్టు – B** | మార్కులు: 10

## II. పదజాలం

ఇ) కింది పదాలను సొంతవాక్యాల్లో ప్రయోగించండి. **2 × 1 = 2**

**8.** ఇగపటు

**9.** కృషి

$16 \times \frac{1}{2} = 8$

**10.** 'చెవువారిచ్చు' పదానికి అర్థం ( )

A) చెవు ఇవ్వడం B) చెవు తుడ్వడం C) శ్రద్ధగా విను D) వినకపోవడం

**11.** బతుకమ్మ పాటలు <u>పసందుగా</u> వింటాం. గీత గీసిన పదానికి అర్థం. ( )

A) ఇష్టం B) అయిష్టం C) కష్టం D) మొత్తం

**12.** 'పాలిపెర' పదానికి అర్థం ( )

A) జాడ B) గుర్తు C) చిహ్నం D) అన్నీ

**13.** మా ఊరిలో 'మోతెబరి' రైతులు లేరు. మోతెబరి అంటే ( )

A) పేద రైతు B) ధనిక రైతు C) మాట్లాడే రైతు D) అమాయకపు రైతు

**14.** 'వటువు' పదానికి పర్యాయపదాలు ( )

A) బ్రహ్మచారి, వడుగు B) పొడుగు, ఎత్తు

C) స్నేహితుడు, చెలికాడు D) మునుపు, ముందు

**15.** తెలంగాణ ఖ్యాతిని నలుదిశలకు వ్యాపింపజేయాలి. 'దిశ' పదానికి పర్యాయపదాలు ( )

A) దిక్కు, మొక్కు B) దిక్కు, కాష్ఠ C) వ్యాప్తి, వల D) మొత్తం, అంతా

**16.** ఖడ్గం, కత్తి పదాలకు సరిపోయే సమానార్థక పదాన్ని గుర్తించండి. ( )

A) కృపాణం B) కనకం C) ఆశ D) కోవెల

**17.** కిందివాటిలో బ్రాహ్మణుడు, భూసురుడు పదాలకు సరిపోయే సమానార్థకం. ( )

A) విష్ణువు B) విప్రుడు C) వెన్నెల D) వానరుడు

**18.** 'కవి' పదానికి నానార్థాలు ( )

A) కనకం, పండితుడు B) శుక్రుడు, జలపక్షి

C) వంశం, జాతి D) పందెం, కూలీ

**19.** తండ్రి, బృహస్పతి పదాలకు సరిపోయే నానార్థ పదం ( )

A) గురువు B) రాజు C) హరి D) మిత్రుడు

**20.** <u>మృత్యువు</u>ను తప్పించుకోలేం. గీత గీసిన పదానికి వికృతిని గుర్తించండి. ( )

A) మృతి B) మతి C) మిత్తి D) మృత్యు

**21.** 'హృదయం' పదానికి వికృతి ( )

A) హృది B) ఎద C) దయ D) హృదయ

www.eenadupratibha.net

**22.** జన్నం చేస్తే పుణ్యం కలుగుతుంది. 'జన్నం' పదానికి ప్రకృతి ( )

A) జొన్న B) యజ్ఞం C) అన్నం D) దానం

**23.** 'జోదులు' పదానికి ప్రకృతి పదం ( )

A) యోధులు B) యోదలు C) జోడీలు D) ఒదులు

**24.** 'విశ్వంభరుడు' వ్యుత్పత్త్యర్థం ( )

A) విశ్వాన్ని భరించనివాడు B) విశ్వాన్ని భరించేవాడు

C) విశ్వాన్ని జయించేవాడు D) విశ్వాన్ని జయించనివాడు

**25.** 'అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించేవాడు' వ్యుత్పత్త్య అర్థం. ( )

A) గురువు B) త్రివిక్రముడు C) నీరజభవుడు D) జనకుడు

www.eenadupratibha.net
www.eenadupratibha.net

# సమాధానాలు

## పార్టు - A

I. అ)

**1. మాట తప్పకుండుట మంచిది. ఎందుకో రాయండి.**

జ: మాట తప్పకుండా ఉండటం మంచిది. ఎందుకంటే మాట తప్పితే గౌరవం పోతుంది. మనమంటే చులకన భావం ఏర్పడుతుంది. మాట తప్పేవాడు అనే ముద్ర వేస్తారు. నమ్మకాన్ని కోల్పోతారు, చివరకు కుటుంబంలోని వారు కూడా విలువ ఇవ్వరు. మాట తూటా లాంటిది కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. మాట తప్పడం వల్ల అందరూ దూరమవుతారు. ఏకాకిగా మిగలాల్సి వస్తుంది.

**2. 'వీరు వీరులు పరార్థుల్ తెల్గు జోదుల్' అంటే మీకేం అర్థమైంది?**

జ: 'వీరు వీరులు పరార్థుల్ తెల్గు జోదుల్' అంటే తెలంగాణ వీరులు వీరత్వంతో పాటు ఇతరులు కష్ట సమయంలో ఉన్నప్పుడు ఆదుకునే పరోపకారులని అర్థమైంది. తెలంగాణ వీరులు కాంతి వంతమైన సూర్యుడిని పిలిచి దేశమంతా కొత్త కాంతిని నింపినవారు. వారిలో విప్లవాత్మకమైన భావాలు ఉన్నాయని అర్థమైంది. వీరందరికీ భూ మండలాన్ని సవరించే తెలివి తేటలు ఉన్నాయని అర్థమైంది.

**3. గురుస్థానీయులని ఎవరిని అంటారు?**

జ: గురుస్థానీయులు అంటే గురువుతో సమానమైన వారని అర్థం. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఏదైనా సందర్భంలో వారి నుంచి మనం ఏమైనా నేర్చుకున్నట్లయితే వారు గురువుతో సమానం. గురువుకు ఉండే లక్షణాలు కలిగి సేవాభావంతో సలహాలు, సూచనలు చేసే ప్రతి ఒక్కరు గురుస్థానీయులుగా పేరుపొందుతారు. సామల సదాశివ చాలా మందిని గురుస్థానీయులుగా పేర్కొన్నారు.

**4. దాశరథి గురించి రాయండి.**

జ: దాశరథి రంగాచార్యులు నిజాం రాజుకు వ్యతిరేకంగా పని చేసిన గొప్పకవి. ఆయన అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, పునర్నవం, కవితా పుష్పకం, తిమిరంతో సమరం, అమృతాభిషేకం అనే కవితా సంపుటాలను రాశారు. యాత్రాస్మృతి అనే స్వీయచరిత్రను రచించారు. సినిమా పాటల రచయితగా అనేక పాటలు రాసిన ప్రజాకవి. తెలుగు గజల్ ప్రక్రియకు ప్రాణం పోసిన రచయిత. ఆయన 1961లో గాలిబ్ గజళ్లను అనువదించారు.

ఆ)

**5. నగరంలో జీవన విధానం ఎలా ఉంటే బాగుండేదో వివరించండి**

జ: నగర జీవనంలో ఒకరినొకరు పట్టించుకొని సహాయ సహకారాలు అందించుకోవాలి. అందరం సమానం అనే భావన కలిగి ఉండాలి. ప్రమాదాలు లేని జీవనం కొనసాగాలి. ఆత్మీయ పలకరింపులతో జీవనం సాగాలి. యాంత్రిక మానసిక స్థితి ఉండ కూడదు. శబ్ద కాలుష్యం లేకుండా ప్రశాంత జీవనం గడపాలి. నగరం ఎంతమంది వచ్చినా తన అక్కున చేర్చుకునే కల్పవృక్షంలా ఉండాలి. మోసాలు లేని జీవితం, కృత్రిమ నవ్వులు లేకుండా కొనసాగాలి. జీవన వ్యయం తక్కువగా ఉండాలి. అన్ని రకాల సౌకర్యాలు అందరికీ అందుబాటులోకి రావాలి. ధనవంతులు అందరూ పేదవారిని ఆదుకోవాలి.

పచ్చని చెట్లతో కళకళలాడుతూ స్వాగతం పలకాలి. నగర జీవనం ఆనందకరమైందిగా ఉండాలి. రసాయన శాలల్లా కాకుండా అనుబంధాలను పంచే ఆత్మీయ శాలలుగా నిలవాలి.

(లేదా)

ప్ర: **శతక మధురిమ పాఠం ఆధారంగా మీరు తెలుసుకున్న విషయాలు ఏమిటో తెలపండి.**

జ: **శతక మధురిమ పాఠం ఆధారంగా నేను తెలుసుకున్న విషయాలు:**

★ సత్యం, దయ, ఏకాగ్రత అనే పువ్వులతో పూజలు చేయాలి.

★ ప్రకృతి అన్నీ ఇస్తుండగా రాజులను ఆశ్రయించడం వృథా.

★ సంపద లేకున్నా మంచి గుణాలు, మనసు నిండా మంచితనం ఉంటే ప్రకాశించవచ్చు.

★ యుద్ధ రంగంలో శత్రుభయంకరుడై, దుఃఖం వచ్చేవారికి బంధువై నిలిచే రాముడిని మించిన దైవం లేదు.

★ విష్ణు భక్తులను నిందించకుండా ఉంటే చాలు అనేక గ్రంథాలు చదివిన దాంతో సమానం.

★ సజ్జనులను మోసం చేయకుండా ఉంటే చాలు గొప్ప బహుమతిని ఇచ్చిన దాంతో సమానం.

★ త్యాగ గుణం కలిగి, మాతృదేశపు గొప్పదనాన్ని వివరించే వారు గొప్పవారు. వారే అపూర్వమైన కీర్తిమంతులు.

★ మిత్రుడు పుస్తకం మాదిరి మిక్కిలి నేర్పుతో మంచిని బోధిస్తాడు. మిత్రుడు నిండు మనసుతో సంతోషాలను ఇస్తాడు.

★ మాయమాటలు చెప్పకుండా, లంచాలకు విలువ పెంచకుండా ఉండాలి.

★ తల్లిదండ్రులను ఇంటి నుంచి వెళ్లగొట్టకుండా ప్రేమతో సేవలు చేయాలి.

**6. 'కొత్తబాట' పాఠాన్ని అనుసరించి ఆనాటి పల్లెల్లోని పరిస్థితులను విశ్లేషించండి.**

జ: **ఆనాటి పల్లెల్లో పరిస్థితులు:**

★ ఆనాటి పల్లెల్లో మోతెబరి రైతులు చాలా మంది ఉండేవారు.

★ రచ్చబండ, రాగిచెట్టు తోటి మనుషులకు సమానమైన విలువను ఇవ్వలేవు. మిత్తితోనే మిద్దెలు కట్టేవారు ఉండేవారు.

★ అర్ధమ్మ రాత్రి దొంగతనాలు, సేండ్ల దోపిడీలు, పరిక్కంపలు, ముంతపొగలు, బండ బర్వులు ఉండేవి.

★ రాత్రి బడులు లేవు.

★ పెండ్లి జరిగే సందర్భాల్లో పల్లకీలు వచ్చేవి.

★ చీమిడి ముక్కులతో, ఊడ్సు కండ్లతో పిల్లలు ఉండేవారు.

★ ఆచార సంప్రదాయాలకు విలువ ఎక్కువగా ఇచ్చి ఒక వర్గం శాసించేది.

★ శ్రమ దోపిడీ జరిగేది.

★ అమాయకులను మోసం చేసేవారు.

★ మనుషుల మధ్య అంతరాలు ఉండేవి.

★ ఒకరిని ఎక్కిచ్చి, మరొకరిని దించి ఇద్దరినీ ఎదగనీయకుండా చేసేవారు ఉండేవారు.

★ నాల్కెలో తీపి, కడుపులో విషం గలవారు ఎక్కువ.

**(లేదా)**

ప్ర. **నిమ్న జాతులను భాగ్యరెడ్డి వర్మ ఎలా జాగృతం చేశాడో వివరించండి.**

జ: భాగ్యరెడ్డి వర్మ నిమ్నజాతుల్లో ఉన్న అజ్ఞానాన్ని, ఉదాసీనతను గుర్తు చేశాడు. అణగారిన కులాల వికాసానికి తీవ్రంగా కృషిచేశారు. చిత్తశుద్ధి, నిజాయితీ, పట్టుదలతో నిమ్నజాతులను జాగృతం చేశాడు. మనుషులంతా పుట్టుకతో సమానమని, తక్కువ, ఎక్కువ అనే భేదాలు లేవనే సత్యాన్ని తెలుసుకునేలా చేశాడు. వారి చదువుపై దృష్టి పెట్టి మార్పులు తీసుకురాగలిగాడు. చదువు మూలంగా కొన్ని సాంఘిక దురాచారాలు లేకుండా చేయగలిగాడు. సామాజిక స్వచ్ఛత గురించి చెప్పి తన జాతి జనులను ఏకతాటిపై నడిపాడు. దేవదాసి, ముర్లి, వేశ్య సంప్రదాయాలను అడ్డుకొని నిరసించాడు. తాగుడును మాన్పించగలిగాడు. ప్రతి సభలో పాల్గొని తన జాతి జనులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించాడు. అంటరాని వర్గాలను ఆది హిందువులుగా నమోదు చేయించాడు. పాఠశాలలను స్థాపించి వారి శ్రేయస్సుకు దోహదపడ్డాడు. నిమ్నజాతుల వారు అందరితో సమానమేనని నిరూపించాడు.

**7. శ్రీరాముడు శివధనుస్సును విరిచిన విధానాన్ని తెలపండి.**

జ: **శ్రీరాముడు శివధనుస్సును విరిచిన విధం:**

విశ్వామిత్రుడి యాగపరిరక్షణకు వెళ్లి సఫలీకృతులైన శ్రీరాముడు, లక్ష్మణుడు గురువుతో జనకమహారాజు ఇంటికి వెళ్లారు. విశ్వామిత్రుడు దశరథ మహారాజు పుత్రులైన శ్రీరాముడు, లక్ష్మణుడిని పరిచయం చేసి, మీ వద్ద ఉన్న శివధనుస్సును చూపించమని జనకుడిని కోరాడు. శివధనుస్సు చరిత్రను తెలిపి, ఆ ధనుస్సును ఎక్కుపెట్టిన వారికే తన కుమార్తె సీతను ఇచ్చి

వివాహం చేస్తానని జనకుడు అన్నాడు. ఎందరో రాజులు ప్రయత్నం చేసి వెనుదిరిగారని తెలిపాడు. ఇదంతా విని విశ్వామిత్రుడు ధనుస్సును తెప్పించమన్నాడు. అయిదువేల మంది అతికష్టం మీద శివధనుస్సు ఉన్న పేటికను తీసుకువచ్చారు. విశ్వామిత్రుడి అనుమతితో శ్రీరాముడు ధనుస్సు మధ్య భాగాన్ని అవలీలగా పట్టుకున్నాడు. రాముడు చేతితో పట్టుకోగానే ధనుస్సు వంగింది. వింటినారి సారించాడు. అందరూ ఆశ్చర్య పోతుండగా అల్లెతాడును లాగగానే పిడుగులా శబ్దం చేస్తూ ధనుస్సు విరిగిపోయింది. విశ్వామిత్రుడు, జనకుడు, రామ లక్ష్మణులు తప్ప మిగతావారంతా మూర్ఛపోయారు. జనకుడు తన కుమార్తె సీతను రాముడికి ఇచ్చి వివాహం చేయడానికి సిద్ధమయ్యాడు.

**(లేదా)**

ప్ర. **శ్రీరాముడు వనవాసానికి వెళ్లడానికి కారణాలు రాయండి.**

జ: **శ్రీరాముడు వనవాసానికి వెళ్లడానికి కారణాలు:**

శ్రీరాముడిని అందరి అభీష్టం మేరకు చక్రవర్తిగా చేయాలని దశరథుడు అనుకున్నాడు. పట్టాభిషేక మహోత్సవానికి అయోధ్య సిద్ధమవుతున్న తీరును చూసి కైకేయి దాసి మంథర జీర్ణించుకోలేక పరిగెత్తి కైకేయికి చెప్పింది. రాముడి పట్టాభిషేక విషయం విన్న కైకేయి సంతోషించి మంథరకు బహుమతి ఇచ్చింది. దుఃఖించాల్సిన సమయంలో ఎందుకు సంతోషిస్తున్నావని మంథర కైకేయిని అన్నది. తనకు రాముడు, భరతుడు ఇద్దరూ సమానమేనని, రాముడు రాజయితే ఆనందమేనని అన్నది. ఇది విన్న మంథర రాముడు రాజయితే కౌసల్య రాజమాత అవుతుంది. నువ్వు ఆమెకు దాసివి అవుతావని అన్నది. అంతేకాదు రాముడి సంతానానికి తర్వాతి రాజ్యాధికారం వస్తుంది. కానీ భరతుడి సంతానానికి రాదని దుర్బోధ చేసింది. రాముడు అడవులపాలు అయ్యేలా చూడమని కోరింది. కైకేయి మనసు మార్చుకొని సిద్ధమైంది. పట్టాభిషేక విషయం చెప్పడానికి వచ్చిన దశరథ మహారాజుతో తనకు గతంలో ఇచ్చిన వరాలను ఇప్పుడు కోరుతానని చెప్పింది. దానిలో ఒకటి శ్రీరాముడు వనవాసానికి పద్నాలుగు సంవత్సరాలు వెళ్లాలని కోరింది. దాంతో రాముడు పితృభక్తితో వనవాసానికి బయలుదేరి వెళ్లాడు.

## పార్టు – B

**8.** మా నాన్న ఇగపటు అని పుస్తకాన్ని ఇచ్చాడు.

**9.** విజయం సాధించాలంటే కృషి ఉండాలి.

**10-C; 11-A; 12-D; 13-B; 14-A; 15-B; 16-A; 17-B; 18-B; 19-A; 20-C; 21-B; 22-B; 23-A; 24-B; 25-A.**

**రచయిత: జి. అంజాగౌడ్**

www.eenadupratibha.net